క్లుప్తంగా

వెలగని వీధి దీపంతో పాట్లు



శివాజీపాలెంలో సచివాలయం ఎదురుగా వెలగని వీధి లైట్

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలో వీధి దీపాలు వెలగడం లేదు. కాలనీలో పోల్ నంబర్ 18బీ5/2కు ఉన్న లైట్ నెల రోజులుగా వెలగకపోవడంతో రాత్రి వేళ అంధకారం నెలకుంటోంది. అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆరిలోవ: విశాలాక్షినగర్ ప్రాంతంలో విద్యుత్ మరమ్మతులు జరగనుండడంతో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. విమ్స్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ నిర్వహణ, తదితర మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, సంజీవినగర్ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీ, చలపతినగర్, వెటర్నరీ కాలనీ, ఫారెస్ట్ రోడ్డు, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

'గైస్'లో కోర్సుల నిర్వహణ పరిశీలన



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న బోర్డు సభ్యులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్(గైస్) నిర్వహణను బుధవారం కాలేజీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు పరిశీలించారు. ఈ కాలేజీలో రెండు కోర్సులకు ఎన్‌బీఏ గుర్తింపు లభించినందున వాటి నిర్వహణ తీరుపై డైరెక్టర్ల బృందం సమీక్ష నిర్వహించింది. ప్రొఫెసర్ వీఎస్ఆర్‌కే ప్రసాద్, ప్రొఫెసర్ డీపీ నాయుడు, ప్రొఫెసర్ వి.పద్మశ్రీ, డాక్టర్ వోఎం రావ్, కేవీకే సుబ్బరాజు, అరుణలతో కూడిన బృందం కాలేజీలోని ప్రయోగశాలల నిర్వహణ, వాటిని విద్యార్థులు ఉపయోగించుకుంటున్న తీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించింది. ఈ సందర్భంగా కెటలిస్ట్ న్యూస్ లెటర్‌ను బృంద సభ్యులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణ, విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ. 21.3 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, సేవకులు

కంచరపాలెం: జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో బుధవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకుల సంయుక్త ఆధ్వర్యంలో అమ్మవారి హుండీలు లెక్కించారు. 50 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాల ద్వారా రూ. 21,03,182 వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. సహాయ కమిషనర్, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బి. వసంతకుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



వెంకోజీపాలెం జీవీఎంసీ పాఠశాలలో డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రత్నం



11వ వార్డు బాలాజీనగర్‌లో డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

ఆరిలోవ: సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియాపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని జీవీఎంసీ మలేరియా విభాగం సిబ్బంది సూచించారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మలేరియా విభాగం ఆధ్వర్యంలో బుధవారం 11వ వార్డ్ పరిధి బాలాజీనగర్‌లో డ్వాక్రా మహిళలు, ఆర్పీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, శానిటరీ విభాగాల సిబ్బంది పాల్గొని మహిళలకు డెంగ్యూతో పాటు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గునియా, జపనీస్ ఎన్‌కె ఫైలేరియాసిస్ తదితర వ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలో తెలియజేశారు. డయేరియా, టైఫాయిడ్, తదితర వ్యాధులు ఎలా వ్యాపిస్తాయో వివరించారు.

దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి తెలియజేశారు. అనంతరం మహిళలతో కలసి బాలాజీనగర్ వీధుల్లో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నమ్మి బంగార్రాజు, సచివాలయం శానిటరీ సెక్రటరీ చిట్టిబాబు, మలేరియా విభాగం హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, మెడికల్ అండ్ హెల్త్ మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ దుర్గారావు, పాల్గొన్నారు.

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం డెంగ్యూపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగం సూపర్‌వైజర్ వై.ఎస్.రత్నం మాట్లాడుతూ దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నిల్వ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పి.శేషుబాబు, రామునాయుడు, శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

జూ, విమ్స్ కార్మికుల నిరసన

- కనీస వేతనాలు చెల్లించాలి
- సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే



జూ గేటు వద్ద కార్మికులతో కలసి నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆరిలోవ: డిమాండ్స్ డే సందర్భంగా జూ పార్కు, విమ్స్‌లో పని చేస్తున్న కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ దేశ వ్యాప్తంగా బుధవారం డిమాండ్స్ డే నిర్వహించింది. ఇందులో భాగంగా జూ పార్కు వద్ద సీఐటీయూ జూ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ సుమారు 15 సంవత్సరాల నుంచి జూలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడంలేదన్నారు. కనీసం రూ.26 వేలకు తక్కువ కాకుండా వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మూడోసారి మోదీ ప్రభుత్వం వచ్చినా కార్మిక వ్యతిరేక విధానాలలో మార్పు రాలేదన్నారు. కార్మికులకు నష్టం చేసేలా, యాజమాన్యాలకు లాభం చేకూరినట్లు విధానాలు అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్పు చేసి యజమానులకు కార్మికులను బానిసలుగా చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. భవిష్యత్‌లో కార్మికుల సమస్యలపై ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర కుమార్, జూ కార్మిక యూనియన్ నాయకులు నరేష్, పైడిరాజు, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

◆ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్)లో పని చేస్తున్న కార్మికులతో కలసి ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మిక యూనియన్, ఆరిలోవ జోన్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ విమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సక్రమంగా చెల్లించాలనాన్నారు. ఈ కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సీఐటీయూ నాయకులు కుమార్, విమ్స్ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికుల నాయకులు రాజేశ్వరి, కనకరాజు,అన్నపూర్ణ, సుంధూషా, పార్వతమ్మ పాల్గొన్నారు.

ఈ నెల్లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి



ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థి నాయ

ఎంవీపీ కాలనీ: డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఈ నెలలోనే విడుదల చేయాలని ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను నగరంలోని ఓ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా నిరుద్యోగులు డీఎస్సీ నోటిఫికేషన్ కోసం చూస్తున్న ఎదురుచూపులతో పాటు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. డీఎస్సీకి జనరల్ కేటగిరీ అభ్యర్థుల వయోపరిమితి అర్హతను 48 ఏళ్లకు పెంచాలని విద్యార్థి నాయకుడు సిర్లా శ్యామ్ కోరారు. కొన్నేళ్లుగా నోటిఫికేషన్స్ లేకపోవడంతో అర్హత ఉన్న వేల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందలేకపోయారన్నారు. నిరుద్యోగల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉత్తరాంధ్ర విద్యార్థి నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

యూనిఫారం పంపిణీ

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు బుధవారం యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం భవాని, ఉపాధ్యాయులు, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గంజాయితో ముగ్గురి అరెస్ట్

గోపాలపట్నం: ఒడిశా ఏజెన్సీ ప్రాంతం నుంచి వస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 1.5కిలోల గంజాయి, 3 కిలోల లిక్విడ్ గంజాయిని టాస్క్ ఫోర్స్ పోలీసులు, గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. పాడేరు రూరల్ ఒడిశా బోర్డర్ నుంచి కేజిన్నర గంజాయి, 3కిలోల లిక్విడ్ గంజాయిని ఎన్‌ఏడీ కాకానినగర్ కు చెందిన రామ్ ప్రసాద్, విజయనగరానికి చెందిన భరత్ శ్యామ్‌సుందర్, మరో మైనర్ తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో విమాన్‌నగర్ నుంచి యల్లపువాని పాలెం ఎస్సీ కాలనీ రోడ్డులో వలవేసి పట్టుకున్నారు. వారి నుంచి గంజాయి, లిక్విడ్ గంజాయితో పాటు 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపిచారు.

ఘనంగా సంగీత దినోత్సవం



విశాఖ వ్యాలీలో గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: విశాఖ వ్యాలీ స్కూల్‌లో బుధవారం ప్రపంచ సంగీత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి డైరెక్టర్ డి.సతీష్‌కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాటలు ఆలపించి అలరించారు. సంగీత పరికరాలను ఉపయోగించి పాటలు పాడుతూ చేసిన నృత్యం అతిథులు, విద్యార్థుల తల్లిదండ్రులను అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు కళలపై అవగాహన కల్పించడానికి ఇటువంటి వేడుకలు దోహదపడతాయన్నారు. సంగీతం పట్ల ఆసక్తి గల పిల్లల్ని తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంగీతం పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించి ముఖ్యఅతిథి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

డివిజన్ పరిధిలో డీఆర్ఎం భద్రతా తనిఖీలు



శివలింగపురం రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలో కేకే లైన్ కొత్తవలస–శివలింగపురం మధ్య బుధవారం డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ భద్రతా తనిఖీలు నిర్వహించారు. శివలింగపురం స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ మార్గంలో జరుగుతున్న ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ పనులు, ట్రాక్ సర్క్యూట్స్, టన్నెల్స్, పాయింట్స్, క్రాసింగ్స్, బ్రిడ్జిల నిర్వహణ, ట్రాక్షన్ సబ్ స్టేషన్స్, వసతులు, భద్రతా ప్రమాణాలు, రక్షణ గోడలు వంటి ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షా కాలంలో బండరాళ్లు ట్రాక్‌లపై పడేందుకు అవకాశమున్న ప్రాంతాలల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం స్టేషన్ మాస్టర్, సిబ్బందితో డీఆర్ఎం మాట్లాడారు. టన్నెల్స్, ఘాట్ సెక్షన్లలో ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రైళ్ల రాకపోకలు సాఫీగా సాగేందుకు అన్ని భద్రతా ప్రమాణాలను పాటించాలని, విధి నిర్వహణలో ఏ మాత్రం ఆదమరచి ఉండరాదని అధికారులకు, సిబ్బందికి సూచించారు. తనిఖీల్లో ఏడీఆర్ఎం(ఆపరేషన్స్) మనోజ్‌కుమార్ సాహూ, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ పార్క్‌ను సందర్శించిన వీఎంఆర్‌డీఏ కమిషనర్



సెంట్రల్ పార్కును సందర్శిస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ కమిషనర్ రవీంద్ర బుధవారం సెంట్రల్ పార్క్‌ను సందర్శించారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పాడైన చిల్డ్రన్ ప్లే పరికరాలు, సైన్ బోర్డులను సాధ్యమైనంత త్వరగా బాగు చేయించాలని అధికారులకు సూచించారు. అదే విధంగా వ్యర్థాల నిర్వహణ త్వరితగతిన చేపట్టాలని, నడక దారిలో పాడైన టైల్స్ స్థానంలో కొత్తవి వేయాలని తెలిపారు. ఈ పర్యటనలో సీఈ భవానీ శంకర్, ఎస్ఈ బలరామరాజు, ఈఈలు ఎస్‌వీఎస్ఎన్ రాజు, రామరాజు, రేంజ్ ఆఫీసర్ శ్యామల, డీఈ మురళీకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వెబ్ ఆప్షన్ల ఎంపిక



కంచరపాలెం పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రంలో ఆప్షన్ల ఎంపికకు వచ్చిన విద్యార్థులు

మురళీనగర్: ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి నిర్వహిస్తున్న వెబ్ ఆప్షన్ల ప్రక్రియ బుధవారం జోరుగా సాగింది. ఈ నెల 8న వెబ్ ఆధారిత కోర్సులు, కాలేజీల ఎంపిక ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ మొదటి రెండు రోజులు సర్వర్ సహకరించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం సాయంత్రానికి సర్వర్ పూర్తి స్థాయిలో పనిచేయగా.. బుధవారం ఆప్షన్ల ప్రక్రియ సజావుగా సాగింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ హెల్ప్‌లైన్ కేంద్రానికి సుమారు వంద మంది విద్యార్థులు తరలివచ్చారు. సిస్టం అడ్మిన్ ఎస్.నాగరాజు పర్యవేక్షణలో ఆన్‌లైన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. ఆదాయ ధ్రువ పత్రాలు, ఈడబ్ల్యూస్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌తోపాటు మొబైల్ నంబర్ మార్పు, నాన్ లోకల్ అభ్యర్థులు స్థిర నివాస పత్రాలు అప్‌లోడ్ చేసుకున్నారు. లెక్చరర్ సిహెచ్.అప్పలనాయుడు విద్యార్థులకు సహకరించారు. 12వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకోవచ్చు. ఈ నెల 13న ఆప్షన్లు మార్చుకోవచ్చు.

ప్రజా సేవ, సమాజ చైతన్యమే ప్రధాన లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య కిషోర్‌బాబు

ఎంవీపీ కాలనీ: ప్రజాసేవ, సమాజ చైతన్యమే జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాల ప్రధాన లక్ష్యం కావాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కేంద్రం సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించిన జిల్లా స్థాయి ఒక రోజు జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ల వార్షిక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. స్వచ్ఛభారత్, వ్యాక్సినేషన్, విపత్తుల సాయం, గ్రామీణ ప్రజల్లో చైతన్యం వంటి కార్యక్రమాలకు ఎన్ఎస్ఎస్ అధికారులు, వలంటీర్లు ఎక్కువ ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కొత్త విధానాలతో ముందుకు సాగాలని సూచించారు. ఏయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ సేవా పథకం నిర్వహించిన పలు జాతీయ స్థాయి కార్యక్రమాల్లో ఏయూ తరఫున వలంటీర్లు చురుగ్గా పాల్గొని, పతకాలు కూడా సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



గరుడ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో యజ్ఞోపవీత ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణం నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం జరిపారు. సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. హరినామస్మరణ మార్మోగింది.

క్యాన్సర్ స్క్రీనింగ్‌పై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న వారితో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట: క్యాన్సర్ స్క్రీనింగ్‌పై నెల రోజుల నుంచి జరుగుతున్న శిక్షణ నేటితో ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా త్వరలో చేపట్టనున్న క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం కోసం సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్న సంగతి విదితమే. అందులో భాగంగా హోమీబాబా క్యాన్సర్ హాస్పిటల్ పర్యవేక్షణలో గత నెల 13వ తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న మెడికల్ కాలేజీ వైద్య నిపుణులు (సామాజిక వైద్య శాస్త్ర అధ్యాపకులు, గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, రేడియాలజిస్ట్, సాధారణ సర్జన్లు, రేడియేషన్ అంకాలజిస్టులు, సర్జికల్ అంకాలజిస్టులు) శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ఉన్న అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గల గైనకాలజిస్ట్, డెంటల్ సర్జన్లు, జిల్లా టీం వారు శిక్షణ తీసుకున్నారు. జిల్లాలో ఉన్న 91 మంది వైద్యులు, 9 మంది స్టాఫ్‌నర్సులు, 54 మంది సీహెచ్‌వో, 498 మంది ఏఎన్ఎంలకు బ్యాచ్‌ల వారీగా రోజుకు 40 మంది చొప్పున ఆంధ్ర వైద్య కళాశాలలో శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు ఆధ్వర్యంలో జిల్లా ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ అధికారి డాక్టర్ సాయిసుష్మ, సామాజిక వైద్య విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, అంకాలజిస్టు డాక్టర్ శిల్ప తదితరుల ఆధ్వర్యంలో ఈశిక్షణ కార్యక్రమం జరిగింది.

27న రాష్ట్రస్థాయి ఏఏఎఫ్ వర్క్‌షాప్

అల్లిపురం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా ఫౌండేషన్ (ఏఏఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీన కాకినాడ డి కన్వెన్షన్ హాల్లో 17వ రాష్ట్రస్థాయి ఎస్సీ, ఎస్టీ వర్క్‌షాప్ జరుగుతుందని ఫౌండేషన్ రాష్ట్ర కన్వీనర్ బైపా అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బీఏకే చాంబర్స్‌లో జరిగిన విలేకరులు సమావేశంలో ఆయన వర్క్‌షాప్ బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఎస్సీ, ఎస్టీ న్యాయవాదులు, మేధావులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏఎన్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో ఆశా వర్కర్ భవాని సహకారంతో పుట్టిన బిడ్డలతోపాటు 16 ఏళ్ల వరకు టీకాలు వేశారు. బిడ్డ పుట్టిన 24 గంటల్లోపు బీసీజీ(క్షయ నివారణ), ఓపీవీ, హెపటైటిస్–బీ(కాలేయ వ్యాధుల నివారణ), ఓపీవీ(పోలియో నివారణ) వ్యాక్సినేషన్ చేశారు. ఆరు వారాలుకు ఓపీవీ–1, పది వారాలకు ఓపీవీ–2, 14 వారాలకు ఓపీవీ–3, 9 నెలలకు మీజిల్స్ రూబెల్లా–1 వేస్తున్నట్లు ఏఎన్ఎం కృష్ణవేణి తెలిపారు. అనంతరం పిల్లల తల్లులకు పలు సూచనలిచ్చారు. పిల్లలకు టీకాలు వేయించకపోతే వెంటనే వేయించుకోవాలన్నారు.

మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని వినతి



ఆస్పత్రుల సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్: విశాఖలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో మెరుగైన వైద్య సేవలు కల్పించాలని కోరుతూ బుధవారం ఇన్‌స్పెక్షన్‌కు వచ్చిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్, డాక్టర్ అజిత్‌కు సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ ఈఎస్ఐ బోర్డులో కార్మికుల డబ్బులు లక్షల కోట్లు ఉన్నా, సౌకర్యాలు కల్పించడంలో బోర్డు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. తక్షణమే ఈఎస్ఐ పేషెంట్లకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. రిఫరల్ హాస్పటల్స్ సంఖ్య, బెడ్స్ సంఖ్య, అవసరమైన డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది సంఖ్య పెంచాలన్నారు. షీలానగర్ వద్ద గల ఈఎస్ఐ హాస్పటల్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. దీనికి స్పందించిన కామన్ సపోర్ట్ మిషన్ టీమ్ చైర్మన్ డాక్టర్ కామత్‌సింగ్ విజయవాడలో ప్రిన్సిపల్ సెక్రటరీతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని చెప్పినట్టు నరసింగరావు తెలిపారు.

డీఈవో ఆకస్మిక తనిఖీలు



మింది జెడ్పీ హైస్కూల్‌లో నోట్ బుక్స్‌ను తనిఖీ చేస్తున్న డీఈవో చంద్రకళ

అక్కిరెడ్డిపాలెం: జిల్లా విద్యా శాఖాధికారి ఎల్.చంద్రకళ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆమె పలు తరగతులను పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎస్.ఎస్.ఆంజనేయులును డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిని తిరిగి పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్కూల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. హెచ్‌ఎంకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు విశ్వనాథం, సునీత, తదితరులు పాల్గొన్నారు.